
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



లింగమంతుల జాతర షురూ..

అశ్వాపురం మండలం రేగులగండిలో లింగ మంతుల స్వామి జాతర ఆదివారం ప్రారం భమైంది. భక్తులు తరలివస్తున్నారు. 8లో



'తునికాకు'కు సమాయత్తం

జిల్లాలో గిరిజనులు వేసవి పంటగా భావించే తునికాకు సేకరణకు అటవీశాఖ అధికారులు సమాయత్తమవుతున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం కొద్దిమేర ఎండ తీవ్రత ఉండవచ్చు. రాత్రి వేళలో చలి ప్రభావం తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్‌గా నలుగురు న్యాయవాదులు..

కొత్తగూడెంటౌన్: జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 16 జిల్లాలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. కౌన్సిల్స్‌గా కొత్తగూడేనికి చెందిన నలుగురు న్యాయవాదులను నియమించారు. సోమవారం ఉదయం 9.45 గంటలకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ టి.నవీన్ రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్టు పోలియో జడ్జి జువ్వాడి శ్రీదేవి చేతుల మీదుగా కౌన్సిల్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. డిఫెన్స్ చీఫ్ లీగల్ కౌన్సిల్‌గా న్యాయవాది ఊటుకూరి పురుషోత్తంరావు, డిఫెన్స్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా న్యాయవాది పట్టుపల్లి నిరంజన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్‌గా న్యాయవాదులు జ్యోతివిశ్వకర్మ, నాగస్రవంతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం న్యాయవాదులు వివరాలు వెల్లడించారు.

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగి సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి కొర్స అభిమన్యుడు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సీజన్‌లో నీటి సౌకర్యం కలిగిన రైతులు పెసర, మినుము, నువ్వుల పంటను ఈ నెలలో చివరి వారం వరకు విత్తుకోవచ్చని తెలిపారు. సాధారణ రకాలు వేసినప్పుడు ఎకరానికి 8 కిలోలు విత్తనం వేసుకుని వరుసల మధ్య 30 సెం.మీ, మొక్క మొక్కకు 10 సెం.మీ ఎడం ఉండే విధంగా చూసుకోవాలని వివరించారు. నువ్వులు ఆలస్యంగా సాగుచేస్తే వెర్రి తెగులు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. సాధారణ రకానికి ఎకరానికి 2 కేజీల విత్తనం విత్తుకోవాలని సూచించారు. వరిపంట, నారు దశ నుంచి పిలకలు తొడిగే దశలో ఉందని, వరినాట్లు సకాలంలో వేయని రైతులు, ముదురు నాటు నాటాల్సి వచ్చినపుడు, నారు చివర్లు తుంచి కుదురుకు మొక్కల సంఖ్య 6–8 వరకు పెంచి మొత్తం వరికి సిఫారసు చేసిన నత్రజనిని అదనంగా 25 శాతం పెంచి, మొత్తం నత్రజనిలో దమ్ములో 70 శాతం, మిగిలిన 30 శాతం అంకుర దశ వరకు వేయాలని వివరించారు. పిలకలు తొడిగే దశలో పైపాటుగా డీఏపీ, 20:20:0:13 వంటి కాంప్లెక్స్ రకాలు వేయొద్దని, సాధారణ పొలంలో పైపాటుగా ఎకరానికి 25–30 కేజీల నత్రజనిని సంబంధించిన యూరియాను జల్లాలని పేర్కొన్నారు. పిలకలు తొడిగే దశలో కలుపు ఉంటే నాటిన 15 రోజుల నుంచి 21 రోజుల లోపు సైలోపాప్‌బ్యూటైల్ ప్లస్ పెనాక్యులమ్ అనే కలుపు మందును లీటరుకు నాలుగు మిల్లీ.లీ చొప్పున లేదా ఒక ఎంఎల్ లీటరుకు బిస్ పైరిబాక్ సోడియం కలిపి కలుపు మందుగా పిచికారీ చేయాలని పేర్కొన్నారు. నాప్‌సాక్ స్ప్రేయర్‌తో పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.

8 నుంచి క్రికెట్ టోర్నీ

నేలకొండపల్లి : మండలంలోని బోదులబండలో రాయల ప్రీమియర్ లీగ్ సీజన్–1 ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జరుగుతుందని పోటీల నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.30,116, షీల్డ్, రెండో బహుమతి రూ.20,116 షీల్డ్, మూడో బహుమతి రూ.15,116 షీల్డ్, నాలుగో బహుమతిగా రూ.10, 116, షీల్డ్ అందించనున్నట్లు వివరించారు.

తెగిన గూడ్స్ రైలు లింక్

మధిర: గూడ్స్ రైలు లింక్ తెగిపోవడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడిన ఘటన ఆదివారం మధిర రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ఖమ్మం వైపు నుంచి విజయవాడ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైల్ లింకు మధిర సమీపంలో వైరా నది బ్రిడ్జి వద్ద తెగిపోయింది. విడిపోయిన బోగీలతో సహా ఇంజన్ అర కిలోమీటర్ మేర వెళ్లి మధిర రైల్వే స్టేషన్‌లో నిలిచింది. రైలు గార్డ్, డ్రైవర్ అప్రమత్తమై రైల్వే అధికారుల సూచనల మేరకు బోగీలను తీసుకొచ్చి యథావిధిగా కలిపారు. దీంతో మోటమర్రి రైల్వే స్టేషన్‌లో కృష్ణా, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. సుమారు రెండు గంటల పాటు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

సజావుగా 'కంటి వెలుగు'..

జిల్లాలో 70,489 మందికి నేత్ర పరీక్షలు

- 21,345 మందికి రీడింగ్ గ్లాసుల పంపిణీ
- 10,519 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తింపు
- దూర 'దృష్టి' బాధితులకు అందని కళ్లద్దాలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



చుంచుపల్లి: జిల్లాలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ప్రజలకు అందుబాటులో ఉండేలా కంటి వెలుగు క్యాంపులను ఏర్పాటు చేయడంతో ఎక్కువ మంది స్వచ్ఛందంగా తరలివచ్చి నేత్ర పరీక్షలు చేయించుకుంటున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రజలకు కంటి పరీక్షలపై ముందస్తు అవగాహన కల్పించడంతో అన్ని చోట్లా విశేష స్పందన లభిస్తోంది. అటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సైతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కంటి వెలుగు కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలతోపాటు 104 మున్సిపల్ వార్డుల పరిధిలో 100 రోజులపాటు ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారు. గత నెల 19 నుంచి ప్రారంభం కాగా, పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ కంటి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి అప్పటికప్పుడే రీడింగ్ గ్లాసులతో పాటు మందులను పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ దూర దృష్టి ఉన్న నేపథ్యంలో కళ్లద్దాలకు ఆర్డర్ ఇస్తున్నారు. కార్యక్రమాన్ని జిల్లా, మండల ప్రత్యేక వైద్య బృందాలతో పాటు మండల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

70,489 మందికి కంటి పరీక్షలు

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 7,90,398 మందికి కంటి పరీక్షలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 48 బృందాలను అందుబాటులో ఉంచారు. రూరల్ పరిధిలో 37, అర్బన్ పరిధిలో 11 బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో వైద్యుడు, ఆప్తాలమిస్ట్, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్‌లు, ఆశ వర్కర్లు కలిపి ఎనిమిది నుంచి పది మంది వరకు సేవలు అందిస్తున్నారు. శిబిరాల్లో ఇప్పటి దాకా 70,489 మందికి నేత్ర పరీక్షలు చేయగా, వారిలో 38,625 మందికి ఎలాంటి సమస్యలు లేవని గుర్తించారు. 21,345 మందికి రీడింగ్ గ్లాసులను పంపిణీ చేశారు. మరో 10,519 మందికి కంటి చూపు లోపం ఉందని గుర్తించారు. వీరి వివరాలను ప్రత్యేక ట్యాబ్‌లో నమోదు చేసుకొని కళ్లద్దాలకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. 52 గ్రామ పంచాయతీలు, 19 మున్సిపల్ వార్డుల్లో రెండో విడత కంటి వెలుగు క్యాంపులను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. మరో 29 గ్రామ పంచాయతీలు, 11 వార్డుల పరిధిలో కంటి వెలుగు క్యాంపులు పురోగతిలో ఉన్నాయి.

పక్షం రోజులు గడిచినా..

కంటివెలుగు శిబిరాల్లో పరీక్షించి జిల్లాలో 10,519 మందికి దూరపు చూపు సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. వీరందరికీ కళ్లద్దాలు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. కానీ పక్షం రోజులు గడిచినా ఇంకా కళ్లద్దాలు రాలేదు. దీంతో బాధితులు నిరాశ చెందుతున్నారు.

కళ్లద్దాలు త్వరగా ఇవ్వాలి



కంటి వెలుగు క్యాంపులో గత నెల 20న కంటి పరీక్షలు చేయించుకున్నాను. వైద్య సిబ్బంది పరీక్షించి దృష్టిలోపం అధికంగా ఉందని చెప్పారు. అందుకోసం ప్రత్యేక కళ్లద్దాలకు ఆర్డర్ చేశామని చెప్పారు. పదిహేను రోజుల్లో ఇంటికే వస్తాయని చెప్పారు ఇంకా రాలేదు. ప్రభుత్వం త్వరగా ఇవ్వాలి. –కె.అచ్చమ్మ, పెనగడప గ్రామం

ఆర్డర్ ఇచ్చాం.. రావాల్సి ఉంది



జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ప్రజలు కూడా ఎక్కువ సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన వారికి రీడింగ్ గ్లాసులు ఇస్తున్నాం. దృష్టి లోపం అధికంగా ఉంటే కళ్లద్దాలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు రావాల్సి ఉంది. –జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

అసమ్మతి కట్టడి..!

- పొంగులేటి సభలకు వెళ్లినవారిపై చర్యలు
- రసకందాయంలో బీఆర్‌ఎస్ రాజకీయం
- అప్రమత్తంగా ఉండాలని శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడి సూచనలు
- గీత దాటారంటూ జూలూరుపాడులో బహిష్కరణ వేటు
- ఆసక్తిగా మారిన నేటి అశ్వారావుపేట ఆత్మీయ సభ



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రాష్ట్ర సమితి పార్టీ రాజకీయాలు జిల్లాలో ఆసక్తికరంగా మారాయి. పార్టీలో వినిపిస్తున్న అసమ్మతిని కట్టడి చేసేందుకు పార్టీ నడుం బిగించింది. ముఖ్యంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పీడ్‌కు బ్రేకులు వేసే చర్యలు చేపట్టింది.

సోషల్ మీడియా వేదికగా..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సోషల్ మీడియా ఖాతా ద్వారా ఇప్పటికే చాలాసార్లు రాజకీయ అంశాలపై స్పందిస్తూ వస్తున్నారు. తాజాగా తన ఫేస్‌బుక్ వాల్‌పై రేగా చేసిన కామెంట్లు చర్చనీయాంశంగా మారాయి. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆగం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు గమనించాలని రేగా తన ఎఫ్‌బీ వాల్‌పై పేర్కొన్నారు. పార్టీ మీద గౌరవం ఉన్నవారు ఎవరూ, పార్టీ వ్యతిరేకుల సమావేశానికి వెళ్లొద్దని, జిల్లాలో ఐదుకు ఐదు స్థానాలు గెలుస్తామని, మూడోసారీ మన ప్రభుత్వమే వస్తుందని, స్థానిక నాయకుల మధ్య విభేదాలు ఉంటే కూర్చొని మాట్లాడుదామంటూ పార్టీ శ్రేణులకు సూచనలు చేశారు. దీంతో మాజీ ఎంపీ పొంగులేటి ఆత్మీయ సమావేశాలను లక్ష్యంగా చేసుకుని పరోక్షంగా విమర్శలు చేశారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

అసంతృప్తితో ఆత్మీయ సమావేశాలు..

బీఆర్‌ఎస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినా తనకు సముచిత స్థానం దక్కలేదంటూ ఇటీవల తన అసంతృప్తిని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ పాల్గొన్న పలు కార్యక్రమాలకు పొంగులేటికి ఆహ్వానం అందలేదు. ఇదే తరుణంలో నియోజకవర్గాల వారీగా తన అభిమానులు, అనుచరులతో కలిసి పొంగులేటి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పినపాక, ఇల్లెందు సమావేశాలు ముగిశాయి. అశ్వారావుపేట సమావేశం సోమవారం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఆదివారం జూలూరుపాడు సహకార సంఘం అధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డి నివాసంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గానికి సంబంధించి తన అభ్యర్థిగా బానోతు విజయాబాయి పోటీలో ఉంటారని ప్రకటించారు. అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనే అంశం త్వరలో చెబుతానని అన్నారు. ఈ మీడియా మీట్ మధ్యాహ్నం జరిగితే సాయంత్రానికి లేళ్ల వెంకటరెడ్డితో పాటు ఈ సమావేశానికి హాజరైన వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతా జగన్నాథంలతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ధారవత్ రాంబాబు, హతిరాం మొత్తం ఐదుగురిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు ప్రకటన విడుదల చేశారు.

సర్వత్రా ఆసక్తి

అశ్వారావుపేట నియోజకవర్గానికి సంబంధించిన శీనన్న అభిమానుల ఆత్మీయ సమ్మేళనం నేడు దమ్మపేట మండలం నెమలిపేటలో జరగనుంది. దీనికి సరిగ్గా ఒక్క రోజు ముందే పార్టీ శ్రేణులను ఉద్దేశించి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నుంచి ఎఫ్‌బీ వేదికగా పలు సూచనలు రావడంతో పాటు జూలూరుపాడు మండలానికి సంబంధించి పలువురు నాయకులపై వేటు పడింది. దీంతో నేటి సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లా పార్టీ అధ్యక్షుడు ఫేస్‌బుక్‌పై చేసిన సూచనలు ఏ మేరకు ఈ సభపై ప్రభావం చూపుతాయో నేడు తెలియనుంది. అంతకు ముందు పొంగులేటి ఆత్మీయ సమావేశం నిర్వహించిన రోజునే ఇల్లెందు మున్సిపాలిటీ పాలకవర్గం పోటీగా మరో సమావేశం నిర్వహించింది. ఇప్పుడు అసమ్మతి కట్టడికి ఏక కాలంలో సూచనలు, బహిష్కరణ చర్యలకు బీఆర్‌ఎస్ దిగినట్టయింది.

నాటకోత్సవాలు ప్రారంభం



నాటికలోని ఓ సన్నివేశం

భద్రాచలంటౌన్: భద్రాద్రి వేదికగా నిర్వహిస్తున్న 21వ అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా తాళ్లూరి పంచాక్షరయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సంబరాలను ప్రారంభించారు. మొదటి రోజు కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు దర్శించిన ఖరీదైన జైళ్లు నాటిక వీక్షకులను అలరించింది. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నాటికను వీక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కళాభారతి ఫౌండర్ అల్లం నాగేశ్వరరావు, భద్రాచలం ఆర్డీఓ రత్న కల్యాణి, పాకాల దుర్గాప్రసాద్, తిప్పన సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి కోసం రీ సర్వే..?



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్

కొత్తగూడెంఅర్బన్: క్రమబద్ధీకరణ పట్టాల రీసర్వే పేరుతో లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తున్నారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసర్వే ఏ ప్రతిపాదికన చేస్తున్నారని ప్రశ్నించారు. జీ.ఓ.76 నంబర్ ద్వారా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు? అందులో ఎన్ని దరఖాస్తులు తిరస్కరించారు? ఎందుకు తిరస్కరించారు? తదితర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎవరి కోసం రీ సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో తిరస్కరించిన దరఖాస్తులను కూడా రీసర్వే చేయాలని కోరారు. పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ముప్పై వేల మందికి పట్టాలు ఇస్తామని ప్రకటించి, పదివేల మందికి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పాలకులకు పట్టాలు ఇచ్చే ఉద్దేశం ఉంటే కటాఫ్ తేదీ 2014 జూన్ 2 వరకే పరిగణిస్తే ఎన్ని జీఓలు తెచ్చినా ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. కటాఫ్ తేదీని 2022 డిసెంబరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చెనిగారపు నిరంజన్‌కుమార్, పోలే కనకరాజు, అల్లకొండ శరత్, ఆకుతోట పవన్ కళ్యాణ్, తుమ్మ వంశీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు 12 మంది నాయకుల రాజీనామా

జూలూరుపాడు: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మాయమాటలు చెప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి చేర్చుకొని సముచిత స్థానం ఇవ్వకపోవడంతోపాటు నాయకుల ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ బీఆర్‌ఎస్‌కు చెందిన 12 మంది నాయకులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినవారిలో జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, సొసైటీ డైరెక్టర్లు కళ్యాణపు నరేష్, భూక్యా జవహర్‌లాల్, ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంగోత్ శ్రీనివాసరావు, నాయకులు ధరావత్ రాంబాబు, నర్వనేని పుల్లారావు, శ్రీనాథరాజు నాగరాజు, చలమల నరసింహారావు, యల్లంకి చిన్ననాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ పడమటనర్సాపురం గ్రామ అధ్యక్షుడు లేళ్ల గోపాల్‌రెడ్డి, వెంగన్నపాలెం గ్రామ అధ్యక్షుడు మద్దెబోయిన నరేష్ ఉన్నారు.

వైరా అభ్యర్థిగా విజయాబాయి

మాజీ ఎంపీ పొంగులేటి వెల్లడి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి

జూలూరుపాడు : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థిగా వైరా నుంచి బానోత్ విజయాబాయి బరిలో ఉంటారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు అండగా నిలిచారని, వారి కోరిక మేరకే కమూనిస్టు కుటుంబ నేపథ్యం గల విజయాబాయిని నిలపాలనే నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. గతంలో తనను ఏవిధంగా ఆశీర్వదించారో ఇప్పుడు విజయాబాయి గెలుపు కోసం అలాగే పని చేయాలని కోరారు. కష్టకాలంలో తన వెన్నంటి ఉన్న శీనన్న కుటుంబసభ్యులు, అభిమానుల కోసం పని చేస్తానని, వారి సలహాలు, సూచనల మేరకే తన భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని పునరుద్ఘాటించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, జూలూరుపాడు మండల నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, ఆత్మ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సహస్ర కలశాభిషేకం



స్వామివారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు



రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- రామయ్యకు పంచామృతాలతో అభిషేకం
- కనుల పండువగా రంగనాథ స్వామి కల్యాణం
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం



వేడుకలను వీక్షిస్తున్న ఈఓ దంపతులు, భక్తులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో మాఘమాసోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సహస్ర కలశాభిషేకాన్ని వైభవోపేతంగా జరిపారు. బేడా మండపంలో కలశాలలో శుద్ధ జలాన్ని నింపి దేవతలను ఆవాహనం చేశారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, కలశాలలోని పంచామృత జలాలతో మంగళ వాయిద్యాలు, మేళతాళాలు నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన శ్రీ సీతాలక్ష్మణ సమేత రామయ్య స్వామికి ఆవాహనం చేసిన కలశాలలోని జలాలతో అభిషేకాన్ని కనుల పండువగా జరిపారు. నక్షత్ర హారతిని సమర్పించారు. సహస్ర కలశాభిషేక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. దేవస్థానంలో తెలిసీ తెలియక జరిగిన తప్పొప్పుల ప్రాయశ్చితార్థం మాఘ పౌర్ణమి రోజున స్వామి వారికి సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించటం ఆనవాయితీ అని వేదపండితులు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పవళింపు సేవ రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి కల్యాణం...

రామాలయానికి అనుబంధంగా ఉన్న రంగనాయకుల గుట్టపై వేంచేసియున్న శ్రీ రంగనాథస్వామి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను, కల్యాణ సామగ్రిని రామాలయం నుంచి మేళతాళాల నడుమ రంగనాయకుల గుట్ట ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ ఈఓ శివాజీ పట్టువస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యావాచనం, కంకణధారణ, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

నేటి నుంచి నిత్యకల్యాణాలు..

సహస్ర కలశాభిషేకోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులపాటు రద్దు చేసిన నిత్యకల్యాణాలు సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. భక్తులు గమనించి వేడుకల్లో పాల్గొనాలని ఈఓ శివాజీ కోరారు.

సమానత్వం కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి నిర్మల

బూర్గంపాడు: స్త్రీ, పురుష సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి నిర్మల పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్‌లో ఆదివారం జరిగిన పీఓడబ్ల్యూ సమావేశంలో ఆమె మాట్లాడారు. చట్టసభలు, స్థానిక సంస్థల్లో పురుషులతో సమానంగా మహిళలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు సమగ్ర చట్టాలను తీసుకురావాలని కోరారు. పోడు భూముల సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ నెల 7న మహబూబాబాద్‌లో జరగనున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర స్థాయి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు సున్నం భూలక్ష్మి, బండ్ల మునెమ్మ, కొమరం భద్రమ్మ, సూరపాక అనంతలక్ష్మి, గజ్జల అలివేలు, రాధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అశ్వారావుపేట జిల్లా పరిషత్ పాఠశాల 2001-02 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001–02 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. భద్రాచలం రోడ్‌లోని ఓ పామాయిల్ తోటలో కలుసుకుని రోజంతా ఆట, పాటలతో సందడి చేశారు. చిన్న నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, భద్రాచలం, ఖమ్మం, విజయవాడ, తాడేపల్లిగూడెం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా దూరభారమైనప్పటికీ తమ చిన్న నాటి స్నేహితులను కలుసుకునేందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దీప్తి, సౌజన్య, నందిని, సుధా, ఆదిలక్ష్మి, నవరాత్రి కృష్ణవేణి, కృష్ణకుమారి, మంజుల, రాణి, కుమారి, హైమావతి, దేవి, శీరిష, సింధు, అనూష, హేమ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామాలయ ఈఈగా రవీందర్


రవీందర్‌కు ఉత్తర్వు జారీ చేస్తున్న ఈఓ శివాజీ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో డీఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి.రవీందర్ ఈఈగా ఇటీవల పదోన్నతి పొందారు. కాగా, దీనికి సంబంధించిన ఉత్తర్వులను దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ జారీ చేయగా.. ఆలయ ఈఓ శివాజీ ఆదివారం క్యాంపు కార్యాలయంలో రవీందర్‌కు అందజేశారు. ఈమేరకు ఆలయ అధికారులు, సిబ్బంది, సంఘ నాయకులు రవీందర్‌కు అభినందనలు తెలిపారు.

బీజాపూర్‌లో బీజేపీ నేత హత్య

బంధువులు, కుటుంబసభ్యుల సమక్షంలోనే మావోయిస్టుల ఘాతుకం


నీలకంఠ మృతదేహం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. బంధువుల ఇంట్లో వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళుతున్న బీజేపీ నేతను బంధువులు, కుటుంబసభ్యుల సమక్షంలోనే దారుణంగా నరికి చంపారు. బీజాపూర్ జిల్లా ఆవుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పెకారం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ బీజేపీ అధ్యక్షుడు కెక్కెం నీలకంఠ (45) స్వగ్రామం పెకారం గ్రామం కాగా, కొంతకాలంగా ఊసూరులోనే ఉంటున్నాడు. ఆదివారం పెకారంలో వివాహ వేడుకకు హాజరయ్యాడు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన మావోయిస్టులు నీలకంఠను కత్తులతో పొడవడంతో పాటు గొడ్డళ్లతో దారుణంగా నరికారు. ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందునే హతమార్చామని మృతదేహం వద్ద లేఖ వదలివెళ్లారు.

మందుపాతర నిర్వీర్యం


మందుపాతర నిర్వీర్యం చేసిన ప్రాంతం ఇదే

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెం–కుర్నపల్లి ప్రధాన రహదారిలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరను పోలీసు బలగాలు ఆదివారం నిర్వీర్యం చేశాయి. చర్ల పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్ కథనం ప్రకారం.. సాధారణ తనిఖీల్లో భాగంగా మండలంలోని ఆర్ కొత్తగూడెం నుంచి కుర్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బోదనెల్లి–ఎర్రబోరు గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారిపై మావోయిస్టులు పోలీసు బలగాలను లక్ష్యంగా ఏర్పాటు చేసుకొని ఏర్పాటు చేసిన మందుపాతరను పోలీసు బలగాలు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజబుల్ టీం అక్కడకు చేరుకుని నిర్వీర్యం చేశారు. మందుపాతర సామర్థ్యం సుమారు 20 కిలోలు ఉందని సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సారపాకలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక గ్రామపంచాయతీ కార్యాలయ వెనుక వీధిలోని ఓ ఇంట్లో అన్వర్ భాషా(24) అనే యువకుడుతన కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతడి తల్లిదండ్రులు శనివారం ఉదయం ఊరెళ్లగా.. సోదరుడు శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అన్వర్‌భాషా అర్ధరాత్రి సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన మృతుడి అన్న ఎంతసేపు తలుపు కొట్టిన తీయకపోవటంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా ఉరికి వేలాడుతున్న కనిపించాడు. తర్వాత తలుపులు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే అన్వర్ మృతిచెందాడు. అన్వర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఆ కారణంతోనే అతను ఆత్మహత్యకు పాల్పడినట్లుగా కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన కస్తూరమ్మ(80) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కస్తూరమ్మ తన ఇంటిలో కింద పడిపోయి అనుమాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన చూసిన చుట్టు పక్కల వారు మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతోవచ్చి చూశారు. అయితే కస్తూరమ్మ కిందపడి ఉండటం, తలలో రక్తస్రావం అవుతుండటంతో తొలుత అనుమానం వచ్చినా.. చివరకు కుటుంబ సభ్యులు ఖననం చేశారు.

గూడు చెదిరి.. గుండె పగిలి..



- 'స్పౌజ్' బదిలీలు లేక పోలీసుల ఆవేదన
- గోస పట్టించుకునేదెవరంటూ ఎదురుచూపులు
- పోలీస్ కానిస్టేబుళ్లకు దక్కని స్పౌజ్ బదిలీలు

మధిర: శాంతి భద్రతలను పర్యవేక్షించడంలో.. దుండగుల బారి నుంచి సమాజాన్ని కాపాడటంలో పోలీసులదే కీలక పాత్ర. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అనుక్షణం ప్రజారక్షణ కోసం పరితపిస్తూ.. ఓ వైపు లా అండ్ ఆర్డర్.. మరోవైపు కుటుంబ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా జీవితాన్ని గడుపుతుంటారు. అలాంటి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో దంపతులిద్దరూ కూడా సేవలందించేవారున్నారు. అలాంటి వారికి పెద్ద కష్టమే వచ్చింది. ఉద్యోగం ఉందన్న ఓ ఆశ తప్పితే వారి జీవితంలో సుఖసంతోషాలు కరువై నరకయాతన అనుభవిస్తున్నారు. భర్త ఒకచోట.. భార్య మరోచోట.. వారి పిల్లలు ఇంకోచోట.. ఇలా గూడు చెదిరిన పక్షుల వలె స్పౌజ్ పరిధిలోని కానిస్టేబుళ్ల కన్నీళ్లను దిగమింగుకుని విధులకు హాజరవుతున్నారు. కుటుంబం, విధులు అనే రెండింటి మధ్య తల్లడిల్లుతూ అగమ్యగోచరంగా మారిన తమ తలరాత ఎప్పుడు మారుతుందోనంటూ దీనంగా ఎదురుచూస్తున్నారు.

317 జీఓతో చెల్లాచెదురు

తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త జోనల్ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా 2021లో తీసుకొచ్చిన 317 జీఓ పోలీస్ శాఖలో ఒకే జిల్లాలో పనిచేసుకుంటున్న దంపతులకు శాపంగా మారిన విషయం తెలిసిందే. క్రమబద్ధీకరణలో భాగంగా సిబ్బందిని కొత్త జిల్లాలకు బదిలీ చేశారు. దీంతో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న దంపతులు చెరో జిల్లాలకు బదిలీ అయ్యారు. సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేయడంతో భార్య ఒకచోట, భర్త మరోచోట విధులు నిర్వర్తిస్తూ అక్కడే ఉండాల్సిన పరిస్థితి రావడంతో పిల్లల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. వారి ఆలనా, పాలన, చదువు, ఇలా ప్రతిదీ కష్టంగా మారడంతో స్పౌజ్ కానిస్టేబుళ్లు తమ సమస్యను పరిష్కరించాలంటూ ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు వేడుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి చేరుకోవాలంటే ఆ బాధ వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దంపతులిద్దరూ పోలీసులే.. కానీ..

ఉద్యోగమున్నా అటు పిల్లలను చూసుకోలేక, ఇటు కుటుంబాన్ని పట్టించుకోక దంపతులిద్దరూ బాధను దిగమింగుకుంటూ విధులకు హాజరవుతున్నారు. ఎండనక వాననక కష్టపడి పనిచేస్తున్నా సంతోషం కరువైందని, కుటుంబం దగ్గరగా లేకపోవడంతో స్పౌజ్ కానిస్టేబుళ్లు మానసికంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ ఉన్నా కనీసం కుటుంబ సభ్యులతో సరదాగా కాసేపు మాట్లాడుకోలేని పరిస్థితి ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం కరుణ చూపి తమ సమస్యకు పరిష్కార మార్గం చూపాలని స్పౌజ్ పరిధిలోని పోలీసులు మొరపెట్టుకుంటున్నారు. పిల్లల భవిష్యత్‌ను అర్థం చేసుకుని తమకొక దారిచూపాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల మాదిరి కరుణ చూపండి..

క్రమబద్ధీకరణ సమయంలో ప్రభుత్వం 13 జిల్లాలను బ్లాక్ లిస్టులో ఉంచి దంపతులైన ఉద్యోగుల బదిలీలను నిలిపివేసింది. తాజాగా ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత నెల 26న విద్యాశాఖ 13 జిల్లాల్లోని దంపతులైన ఉపాధ్యాయులను (స్పౌజ్) ఒకే జిల్లాకు బదిలీ చేసింది. అయితే ఎస్జీటీల విషయంలో మాత్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ తరుణంలో పోలీస్ శాఖలో పనిచేస్తున్న స్పౌజ్ పరిధిలోని ఉద్యోగులను కూడా బదిలీ చేయాలని పోలీసులు ప్రభుత్వానికి, డీజీపీకి విజ్ఞప్తి చేస్తున్నారు. కానిస్టేబుళ్ల స్థాయిలో స్పౌజ్ కింద పనిచేసే వారు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 మంది ఉంటారు. బదిలీ అవకాశం కల్పించమని దరఖాస్తు చేసుకొని సంవత్సరం దాటినప్పటికీ ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. ఇబ్బంది ఉందని సిక్ లీవ్, ఎర్న్ లీవ్స్ అడిగినప్పటికీ బందోబస్తు ఉన్నాయని కొన్ని ప్రాంతాల్లో సెలవులకు కూడా అవకాశం ఇవ్వడం లేదని తెలిసింది. అసలే సెలవులు లేని ఉద్యోగం, పిల్లలను చూసుకునేందుకు ఒక పూట అనుమతి తీసుకుని ఇంటికి బయలుదేరినా మార్గమధ్యలో ఎమర్జెన్సీ డ్యూటీ అని ఫోన్ వస్తే కుటుంబాన్ని చూడకుండానే వెనుదిరిగే పరిస్థితి ఉందని పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే సిబ్బంది వాపోతున్నారు. పోలీసులు మినహా మిగతా ఉద్యోగులకు తమకేమైనా సమస్య వస్తే రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు, నిరసనలు తెలుపుతారు. కానీ పోలీసులకు అలాంటి పరిస్థితి ఉండదు. యూనిఫాం వేసుకున్న రోజే వారు ఆ హక్కును కోల్పోతారు. ప్రభుత్వం తమ దీనగాథను అర్థం చేసుకుని సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్పౌజ్ పరిధిలోని పోలీసులు కోరుతున్నారు.

ఖమ్మం జిల్లాలో భార్య కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, భర్త భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. వారికి ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ఇటీవల రెండు సంవత్సరాలు వయసు కలిగిన చిన్న కుమారుడు అనారోగ్యానికి గురి కావడంతో ఎమర్జెన్సీగా ఆసుపత్రికి తీసుకొని వెళ్లాల్సి వచ్చింది. ఆ చిన్నారి తల్లిదండ్రులు విధి నిర్వహణలో ఉండడం, ఎవరూ అందుబాటులో లేకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి చెప్పగా వారు ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. నాలుగైదు గంటల తర్వాత వారు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. ప్రాణాపాయంలో ఉన్న చిన్నారిని ఆసుపత్రిలో చేర్పించలేక, మరో వైపు విధులను వదిలేసి రాలేక వారు నరకయాతన అనుభవించారు.

ప్రారంభమైన లింగమంతుల జాతర

- తొలి రోజు ఉత్సాహంగా సాగిన ఊరేగింపు
- నృత్యాలు చేస్తూ సందడి చేసిన భక్తులు
- నేడు బోనాల ఉత్సవం


ముస్తాబైన లింగమంతుల స్వామి ఆలయం

అశ్వాపురం: మండల పరిధిలోని రేగులగండి గ్రామంలో లింగమంతుల స్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీ భవానీ లింగమంతుల జాతర ఆదివారం ప్రారంభమైంది. శివభవానీ రథాలలో జగ్గారం నుంచి యాదవ కులపెద్దలు, భక్తులు నృత్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. కాగా, ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. కాగా, నేడు(సోమవారం) ఉదయం 5 గంటలకు బోనాల ఉత్సవంతో జాతర ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా గొల్లగూడెం గ్రామానికి చెందిన యాదవ యువజన నాయకులకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ బేరి అందజేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు లంకెల రమేశ్, కమిటీ సభ్యులు, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ కుల పెద్దలు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు కనీస వసతులు కల్పించారు. మణుగూరు పీవీ కాలనీలో రేగులగండి గ్రామం నుంచి గుట్టపైకి వెళ్తే లింగమంతుల స్వామి ఆలయం వస్తుందని సంఘ నాయకులు సూచించారు.


గొల్లగూడెం యువకులకు బేరి అందజేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్


ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కార్మిక వాడల్లో వెలసిన విజ్ఞాన వేదిక..

- ఘనంగా సెయింట్ జోసఫ్ పాఠశాల వజ్రోత్సవ వేడుకలు
- హాజరైన కలెక్టర్ అనుదీప్, సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా, కొత్తగూడెం ఏరియా జీఎం


వేడుకకు హాజరైన కలెక్టర్ అనుదీప్, డైరెక్టర్ బలరామ్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండల పరిధిలోని దన్‌బాద్ పంచాయతీ పరిధిలో గల సెయింట్ జోసఫ్ పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ పా ఎన్.బలరాం, కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ హాజరై నాడు పాఠశాలను(1963లో) స్థాపించిన ఫౌండర్ బ్రదర్ మౌంట్‌ఫోర్ట్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో పాఠశాలలో చదివి, అత్యధిక మెరిట్ సాధించిన విద్యార్థులకు నిర్వాహకులు మెమెంటోలు, రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా చూస్తున్న ఈ రోజుల్లో విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా కార్మిక వాడల్లో ఈ పాఠశాల స్థాపించి విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయడం అభినందనీయమన్నారు. మరో 40 ఏళ్ల తర్వాత శత వసంతాల వేడుకలు కూడా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాక సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎన్.బలరాం, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అండ్ ప్రావెన్సియల్ ఆఫ్ సుపీరియర్ ప్రావెన్సీ ఆఫ్ హైదరాబాద్ షైన్ అలెక్స్, ప్రత్యేక ఆహ్వానితులు పేరెంట్స్ ఆఫ్ బాయ్స్ డాక్టర్ రోజాకిరణ్, డాక్టర్ మాలతీ దంపతులు, పేరెంట్స్ ఆఫ్ గర్ల్స్ అనిత, శ్రీనివాస్ దంపతులు, పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఇల్లెందు ఏరియా జీఎం (పాఠశాల ఓల్డ్ స్టూడెంట్) ఎం.శాలెంరాజు, కొత్తగూడెం ఏరియా డీవైజీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్, ఉపాధ్యాయులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కంటికి కునుకే కరువాయె..

- రాత్రి సమయాల్లో హల్‌చల్ చేస్తున్న దొంగలు
- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లో దుండగులు వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో రాత్రి పూట కునుకు తీయాలంటేనే భయపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మొండికుంట గ్రామంలో గత నెల 21న చిన్నారి వీరభద్రం ఇంటి ఎదుట నిలిపిన బైక్‌ను అదే రోజు రాత్రి దొంగలు దొంగిలించారు. 22న ఇదే గ్రామానికి చెందిన తునికేసి లక్ష్మి రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా రాత్రి 8గంటల సమయంలో బైక్‌పై వచ్చిన వ్యక్తులు మెడలోని బంగారపు పుస్తెల తాడు దోచుకెళ్లడంతో పాటు గ్రామంలోని ట్రాక్టర్ల సామన్లను సైతం దొంగిలిస్తున్నారు. అంతేకాక ఈ నెల 2న రాత్రి నెల్లిపాక గ్రామానికి చెందిన పర్శబోయిన నాగరాజు తన ఇంటి ఎదుట నిలిపిన ఆటోను దొంగిలించారు. మల్లెలమడుగు గ్రామంలో పలు ఇళ్లల్లో అర్ధరాత్రి దొంగలు అలికిడికి ఇంట్లో వారు లేవగా పారిపోయారు. ఇలా గత వారం రోజులుగా రాత్రి పూట గ్రామాలలో వీధి లైట్లు బంద్ చేసి దొంగలు దొంగతనాలకు పాల్పడేందుకు యత్నిస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ చేపట్టాలని కోరుతున్నారు.

మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మార్పు..?


ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం కోసం కొంతమంది కౌన్సిలర్లు ప్రయత్నం చేస్తున్నారు. ఆదివారం అందిన సమాచారం ఇలా ఉంది. మూడు రోజుల క్రితం ఇద్దరు సభ్యులు కొంతమంది కౌన్సిలర్లను కలిసి అవిశ్వాసం కోసం సహకరించాలని కోరినట్లు తెలిసింది. అందుకు ఒక్కో కౌన్సిలర్‌కు రూ.10 లక్షల ఆఫర్ ఇవ్వగా.. అందుకు వారు తిరస్కరించినట్లు తెలిసింది. ఆరు నెలల క్రితం చైర్మన్‌కు కొంతమంది కౌన్సిలర్ల మధ్య చెలరేగిన మాటల యుద్ధం పార్టీ పెద్దలు జోక్యం చేసుకున్నప్పటికీ వైరం ఇంకా సమసిపోలేదు. అంతిమంగా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుని ఆర్డీఓ ఎదుట విచారణకు కూడా హాజరయ్యారు. ఆ విచారణ రిపోర్టు వెలుగు చూడకముందే అటు చైర్మన్, ఇటు వైస్ చైర్మన్ల అధీనంలో ఉన్న భూముల వివాదం తెరమీదికి వచ్చింది. ఇదిలా ఉండగా.. తాజాగా తన పదవికాలం మూడేళ్లు ముగిసి అవిశ్వాసానికి అవకాశం ఉందని తేలటంతో కొంత మంది కౌన్సిలర్లు రాత్రికి రాత్రే మరో శిబిరంలోకి వెళ్లి మంతనాలు జరిపినట్లు సమాచారం. మూడేళ్లలో మెజార్టీ కౌన్సిలర్లకు పాలకవర్గం నుంచి దక్కింది తక్కువే. ఇక మిగిలిన రెండేళ్లు కూడా పరిస్థితి ఇలానే ఉంటదని భావించిన పలువురు కౌన్సిలర్లు అవిశ్వాసం వైపుకు మొగ్గు చూపితే రూ.10 లక్షలు అయినా అందుకోవచ్చని ఆశ పడుతున్నట్లు తెలిసింది. ఇటీవల కోరం కనకయ్య నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాన్ని అడ్డుకునేందుకు ముందు రోజు కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇటీవల సీఎం ప్రకటించిన రూ.25 కోట్ల నిధుల నుంచి ఒక్కో కౌన్సిలర్‌కు రూ.50 లక్షల పనులు ఇస్తామని ప్రకటించినప్పటికీ పనులు చేస్తే ఎంతో కొంత మిగులుతుందని, అదే అవిశ్వాసానికి ఓటు వేస్తే రూ.10 లక్షలు మిగులుతాయని అంతర్మథనం చెందుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావును సంప్రదించగా కొంతమంది కౌన్సిలర్లు అవిశ్వాసం కోసం లోపాయికారి చర్చలు జరుపుతున్నట్లు తన దృష్టికి రావడంతో అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

భద్రాచలంటౌన్: భూ పట్టా కలిగిన వ్యక్తిపై కొందరు దౌర్జన్యంగా దాడికి పాల్పడడంతో ఆదివారం కేసు నమోదైంది. సీఐ నాగరాజురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన డాక్టర్ ఠాకూర్ ప్రసాద్‌కు రాజుపేటకాలనీ శివారులోని చైతన్య స్కూల్ పక్కన ఉన్న భూమి కలదు. అయితే ఆ భూమిని ఆక్రమించాలని నలుగురు గిరిజనులు ఆ భూమిలోని చెట్లను నరుకుతుండగా అడ్డుగా వచ్చిన ఠాకూర్ ప్రసాద్‌పై వారు దాడి చేశారు. దీంతో ఠాకూర్‌ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తిపై..

ఓ యువతిపై దాడి చేసిన వ్యక్తిపై ఆదివారం భద్రాచలం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీఈడీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ యువతి జూనియర్ కళాశాల మైదానంలో ఎస్సై ఈవెంట్స్ కోసం ఆదివారం ఉదయం ప్రాక్టీస్‌కు వచ్చింది. ఈ క్రమంలో అంబోతు జగతిబాబు అనే వ్యక్తి ఆ యువతిని నీవు వేరే వ్యక్తులతో ఎందుకు మాట్లాడుతున్నావ్ అంటూ దాడి చేశాడు. దీంతో చుట్టుపక్కల వారు రావడంతో జగతిబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. యువతి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు.

కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవత..

- నేటి నుంచి ముత్యాలమ్మ అమ్మవారి జాతర..
- రెండేళ్లకోసారి జరగనున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ


ముస్తాబైన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం


విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన బోర్డు

దుమ్ముగూడెం: కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవత.. అమ్మలుగన్న అమ్మ.. మూలపుటమ్మ అమ్మవారు శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర నేడు అంగరంగవైభవంగా ప్రారంభంకానుంది. నేటి (సోమవారం) నుంచి 14వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ జాతర నిర్వహణకు ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి ఆధ్వర్యాన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ప్రతీ రెండేళ్ల కోసారి జరిగే ఈ జాతరను దర్శించుకోవడానికి ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ప్రతీ రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు దాతల సాయంతో మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమం ఆనవాయితీ. ఈ జాతర కోసం ఆలయ ప్రాంగణంవిద్యుత్ దీపాలతో అలంకరించారు.

మూడు ఊరేగింపులు ప్రత్యేకత..

ముత్యాలమ్మ అమ్మవారి తొమ్మిది రోజుల జాతరలో కెల్లా ప్రకాశ్ ఆధ్వర్యాన మూడు, ఆరు, తొమ్మిదో రోజు గ్రామ పురవీధుల్లో గరిగెలతో వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో గ్రామంలోని యువకులు ఆడవారిగా వేషదారణలో అమ్మవారి గరిగెలను తలపై ఉంచుకుని గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి నైవేద్యాలను స్వీకరిస్తారు. ఊరేగింపునకు బయలుదేరే సమయంలో ఆలయ ధ్వజస్తంభంపై ఉన్న గంటలు మోగడం అమ్మవారి నిజరూపానికి దర్శనం. సాంస్కృతిక కార్యక్రమాల్లో మ్యూజికల్ నైట్, చిల్డ్రన్స్ డాన్స్ బేబి డాన్స్, అంధుల మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహించనున్న నేపథ్యంలో యూట్యూబ్ సంచలనం పల్సర్ బైక్ సింగర్ రమణ, పల్సర్ బైక్ సాంగ్ డాన్సర్ కండక్టర్ ఝాన్సీలు తమ టీమ్‌తో ప్రదర్శన ఇవ్వనున్నారు.

● జల పుష్పాల వేట..!


పట్టుబడిన చేపను చూపిస్తున్న ఓ యువకుడు

మండల పరిధిలోని తాటిగూడెం గ్రామ చెరువులో నీరు కొంతమేర అడుగంటిపోవడంతో ఆదివారం గ్రామస్తులంతా ఉదయం చేపల వేటకు ఉపక్రమించారు. వారితో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకుని వలలు, ఊతలు, చీరలు చేతపట్టి చేపల వేటకు దిగి చేపలు పట్టుకున్నారు. చెరువు కట్టపై నుంచి వెళ్లే వారిలో తీరుబడిగా వెళ్లొచ్చనుకునే వాళ్లు సైతం చెరువులోకి దిగి వేట మొదలుపెట్టారు. జల పుష్పాల వేటకు దిగిన వారితో చెరువులో జనసందోహం నెలకొంది. ఈ దృశ్యాలను ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. – కరకగూడెం


చేపల వేటలో నిమగ్నమైన ప్రజలు

బడ్జెట్ రూ.2.9 లక్షల కోట్లు..!

- 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ కసరత్తు పూర్తి
- నేటి ఉదయం 10:30 గంటలకు శాసనసభ ముందుకు..



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) గాను రూ.2.9 లక్షల కోట్ల వరకు అంచనాలతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది. 2022–23కు రూ.2.56 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్ ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈసారి ఆ మొత్తానికి 10 శాతం కంటే కొంచెం ఎక్కువగా రూ. 2.9 లక్షల కోట్ల వరకు బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించనుందని సమాచారం. ఎన్నికల ఏడాది కావడంతో సంక్షేమం, అభివృద్ధిని యథాతథంగా కొనసాగిస్తూ కొన్ని కొత్త పథకాలను జోడిస్తూ ప్రజారంజక బడ్జెట్ పెట్టే కసరత్తు పూర్తయిందని, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఈసారి బడ్జెట్ పెట్టే అవకాశాలున్నాయని ఆర్థికశాఖ వర్గాల ద్వారా తెలిసింది. సోమవారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు శాసనసభలో 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆ తర్వాత శాసన మండలిలో రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రవేశపెడతారు.

సాగునీటికి, సంక్షేమానికి భారీగానే..

గత కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్ మార్కుతో అమలవుతోన్న సంక్షేమ పథకాలన్నీ ఎన్నికల ఏడాదిలో యథాతథంగా కొనసాగేలా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధమైనట్టు సమాచారం. ఈ పథకాలకు తోడు విద్య, వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, మన ఊరు–మన బడి లాంటి పథకాలకు ప్రత్యేక కేటాయింపులు ఈ బడ్జెట్‌లో ఉండనున్నాయని ఆర్థికశాఖ వర్గాలంటున్నాయి. వీటితో పాటు సాగునీటి రంగానికి కూడా ఈసారి భారీ బడ్జెట్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తెచ్చిన అప్పులు ఈ ఏడాది నుంచే తిరిగి చెల్లించాల్సి ఉండడంతో దాని కోసం, పాలమూరు–రంగారెడ్డి లాంటి ప్రాజెక్టులు వేగవంతం చేసేందుకు, ఆగిపోయిన పలు ప్రాజెక్టులను పూర్తి చేసి ఎన్నికల నాటికి ప్రజలకు అందించేలా.. రూ.35 వేల కోట్లకు పైగా సాగునీటి రంగానికి ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుబంధు లాంటి ప్రతిష్టాత్మక పథకం కొనసాగింపుతో పాటు కొత్తగా పంటల బీమా పథకం అమలు చేసేందుకు గాను ఈసారి వ్యవసాయానికి రూ.25 వేల కోట్ల వరకు కేటాయింపులుంటాయని తెలుస్తోంది. పంటల బీమా పథకం కోసం రూ.1,200 కోట్లు, రైతు బంధు పథకం కింద రూ. 8 వేల కోట్ల వరకు ప్రతిపాదించనున్నట్టు సమాచారం. ఇక దళిత బంధుకు గత ఏడాది పెట్టిన బడ్జెట్‌లో ఖర్చు కాకుండా మిగిలిన మొత్తాన్ని ఈ ఏడాదికి బదలాయిస్తూ రూ.20 వేల కోట్ల వరకు కేటాయింపుల్ని ఈ పథకానికి చూపెట్టనున్నట్టు తెలుస్తోంది. దళిత బంధు తరహాలోనే గిరిజన బంధును రూ. 5 వేల కోట్లు (అంచనా) కూడా ప్రకటించే అవకాశముందని, అయితే గిరిజన బంధుకు మార్గదర్శకాలు కూడా సిద్ధం కాని నేపథ్యంలో ఎన్నికల నాటికి బడ్జెట్‌ను ఖర్చు పెట్టగలిగేందుకు ఉన్న అవకాశాలను బట్టి ఈ పథకాన్ని బడ్జెట్‌లో పొందుపరిచే అవకాశాలున్నాయని గిరిజన సంక్షేమ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

సొంత రాబడులపైనే ఆశలు..

రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయంపైనే ఆధారపడి బడ్జెట్ కేటాయింపులు ప్రతిపాదించనున్నట్టు ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.08 లక్షల కోట్ల వరకు పన్ను రాబడులు అంచనా వేయగా, అంచనాలకు తగ్గట్టునే ఈ ఏడాది పన్ను ఆదాయం రూ.లక్ష కోట్లు దాటనుంది. ఈ నేపథ్యంలో సొంత పన్నులు.. ముఖ్యంగా ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల ఆదాయాలను పరిగణనలోకి తీసుకుని గత బడ్జెట్ కంటే 10%నికి పైగా ఎక్కువ అంచనాలను రూపొందించినట్టు సమాచారం. అప్పుల విషయానికొస్తే ఎఫ్‌ఆర్‌బీఎం చట్ట నిబంధనల మేరకు జీఎస్‌డీపీలో 3.5% వరకు ప్రతిపాదించనున్నారు.

ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం


ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకం అమలు కోసం ఉద్యోగుల భాగస్వామ్యంతో కొత్త పథకాన్ని అమలు చేసే యోచనలో భాగంగా రూ.750 కోట్ల కార్పస్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో తన వాటాగా రూ.350 కోట్లు ప్రతిపాదించనున్నట్లు సమాచారం. గత బడ్జెట్ తరహాలోనే సొంత జాగా ఉంటే ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల పథకం కింద రూ.12 వేల కోట్లు, ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షల అభివృద్ధి నిధుల కోసం రాష్ట్రంలోని 12 వేల గ్రామ పంచాయతీలకు రూ.1200 కోట్లు కేటాయించనున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలను కొనసాగించనున్నారు. ఆసరా పింఛన్లకు రూ.15 వేల కోట్ల వరకు ప్రతిపాదించనున్నారు. ఇక ఎన్నికల హామీలో నెరవేర్చడంలో భాగంగా రూ.లక్ష లోపు రైతు రుణమాఫీకి ఈసారి నిధులు కేటాయిస్తారని, ఈ పద్దు కింద రూ.20 వేల కోట్లు అవసరమవుతాయనే చర్చ జరుగుతోంది. విద్యుత్ సబ్సిడీలు, ఆర్టీసీకి ఆసరా కోసం కూడా ప్రత్యేక కేటాయింపులు చూపెట్టనున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల పద్దుకు రూ.30 వేల కోట్లు, అప్పులు, వడ్డీల చెల్లింపునకు రూ.25 వేల కోట్ల వరకు కేటాయించనున్నట్టు సమాచారం.

కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంచనాలపై ఆసక్తి

కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు కింద భారీగా అంచనాలు ప్రతిపాదించడం, కేంద్రం నుంచి ఆశించిన మేర నిధులు రాక డీలా పడిపోవడం ఆనవాయితీగా మారిపోయింది. గత ఏడాది రూ.38 వేల కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వస్తాయని ఆశించినా రూ.10 వేల కోట్లు కూడా రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఈ అంచనాలు రూ.40 వేల కోట్లు దాటినా, ఈసారి కూడా గత ఏడాదిలాగానే మంజూరయ్యాయి. దీంతో ఈసారి గ్రాంట్ ఇన్ ఎయిడ్, కేంద్ర పన్నుల్లో వాటా పద్దుల కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంత అంచనా వేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈసారి కేసీఆర్ మార్కు బడ్జెట్ అంకెలు ఉంటాయని, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3 లక్షలు దాటిన నేపథ్యంలో బడ్జెట్ అంచనాలు కూడా రూ.3 లక్షల కోట్లు ఉంటాయనే ప్రచారం జరిగినా, వాస్తవికతకు అనుగుణంగానే ప్రభుత్వం ముందుకెళ్లనుందని సమాచారం. ఇక 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2.56 లక్షల కోట్ల బడ్జెట్ అంచనా వేసినా.. అప్పులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ పథకాల్లో కేంద్రం నిధుల కోత పెట్టిన కారణంగా సవరించిన అంచనాలు రూ.2.25 లక్షల కోట్లకు పరిమితమయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కుట్రపూరిత కథనాలే

- ఓఎస్డీతో కలసి నేను విజయవాడ వెళ్లినట్లు అభూత కల్పనలు: సీఎస్ జవహర్‌రెడ్డి
- పొరపాటును అంగీకరిస్తూ బేషరతుగా క్షమాపణలు కోరాల్సిందే
- లేదంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవు



సాక్షి, అమరావతి: 'సీఎస్‌తో కలసి వెళ్లిన ఓఎస్డీ' శీర్షికన ఎల్లో మీడియా ప్రచురించిన కథనాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దారుణమైన అబద్ధాలను ఆలంబనగా చేసుకుని ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు, ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ చానల్ రాష్ట్రంలో ఉద్యోగులందరికీ అధినేత అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చులకన చేస్తూ, కుట్రపూరితంగా కట్టుకథలు అల్లాయని స్పష్టం చేశారు. ఓ అత్యున్నత స్థాయి అధికారిని, వ్యవస్థను కించపరుస్తూ తప్పుడు కథనాలు ప్రచురించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఉద్యోగులందరిలో అత్యున్నస్థాయి అధికారిని టార్గెట్ చేస్తూ అవాస్తవాలను ప్రచురించడం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిష్టకు భంగం కలిగించడం ద్వారా ఏ జర్నలిజం విలువల ఆధారంగా పని చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. తాను ఖండనలో పొందుపరిచిన అన్ని విషయాలను అంతే ప్రాధాన్యతతో, బేషరతుగా క్షమాపణలు కోరుతూ ప్రచురించాలన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన సత్యదూరమైన న్యూస్ ఐటమ్‌ను ఆయా పత్రికల్లో ఏ పేజీల్లో ఎంత ప్రాముఖ్యతతో ప్రచురించారో, ఏ సమయంలో ఎంత ప్రాధాన్యతతో చానల్‌లో కథనాలను ప్రసారం చేశారో అంతే ప్రాముఖ్యత, ప్రాధాన్యతతో ఖండనను ప్రసారం చేస్తూ జరిగిన పొరపాటుకు క్షమాపణలు కూడా కోరాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో ఆ న్యూస్ ఐటమ్‌కు బాధ్యులపై న్యాయ నిపుణుల సలహా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీట్ నంబర్ 1 డి... వెళ్లింది హైదరాబాద్

వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం అహోబిలపురం సమీపంలో రూ.5 కోట్లతో పునర్నిర్మించిన శ్రీ భానుకోట సోమేశ్వరాలయం మహా కుంభాభిషేకాన్ని ఫిబ్రవరి 4వతేదీ ఉదయం 9.58 గంటలకు నిర్వహించాలని ముహూర్తాన్ని నాలుగు నెలల క్రితమే 2022 అక్టోబర్ 14 నిర్ణయించారని సీఎస్ తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో తాను ఫిబ్రవరి 2వతేదీ రాత్రి 11 గంటలకు రేణిగుంట ద్వారా కడప చేరుకున్నట్లు వివరించారు. 3వ తేదీ ఉదయం 9.50 గంటలకు కడప కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఆలయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తాను చదువుకున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ముద్దనూరులో విద్యార్థులతో సమావేశం ముగియగానే 4.40కి బయలుదేరానని, సుమారు 8.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్, ఇతర అధికారులు తనకు మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారని తెలిపారు. రాత్రి 9 గంటలకు స్పైస్‌జెట్ ఎస్‌జీ 3003 సిరీస్ ద్వారా 1 డి సీట్‌లో ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నట్లు జవహర్‌రెడ్డి వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే శుక్రవారం రోజు సీఎస్‌తో కలసి ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి విజయవాడ వెళ్లారని, ఒకే వాహనంలో ప్రయాణించారని ప్రచురించిన కథనాలు ఊహాజనితం, సత్యదూరమని చెప్పారు. దారుణమైన ఈ అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

హరీశ్‌రావు చేతుల మీదుగా నాలుగోసారి బడ్జెట్



గత సంవత్సరం బడ్జెట్ బ్యాగ్‌తో హరీశ్ (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో నాలుగోసారి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2004 సంవత్సరం నుంచి ఆయన సిద్దిపేట ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత నేత వైఎస్సార్ కేబినెట్‌లో యువజన వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన తెలంగాణ వచ్చాక భారీనీటిపారుదల శాఖను నిర్వహించారు. 2019లో ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హరీశ్‌రావు మార్చి8, 2020, మార్చి 18, 2021, మార్చి 7, 2022న మూడుసార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు.

ముగిసిన వాణీ జయరామ్ అంత్యక్రియలు

- నివాళులర్పించిన సినీ, రాజకీయ ప్రముఖులు
- వాణీజయరామ్‌ది సహజ మరణమేనని పోలీసుల ధ్రువీకరణ

తమిళ సినిమా: ప్రముఖ గాయని వాణీజయరామ్ భౌతికాయానికి ఆదివారం మధ్యాహ్నం చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు వాణీజయరామ్ పార్థివ దేహానికి తమిళనాడు సీఎం స్టాలిన్, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అంజలి ఘటించారు. ప్రఖ్యాత గాయని పి.సుశీల వాణీజయరామ్ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. అందులో తనకు ఈ విషయం ఆలస్యంగా తెలిసిందని హైదరాబాద్‌లో ఉన్న తన మనవరాలు ఫోన్ చేసి వాణీజయరామ్ కన్నుమూసిన విషయం తెలుసా అని అడిగిందన్నారు. దాంతో తాను షాక్‌కు గురైనట్లు పేర్కొన్నారు. వాణీజయరామ్‌తో కలిసి తాను 100 పాటలు పాడినట్లు గుర్తు చేసుకున్నారు. ఆమె పెద్దగా నవ్వే వారు కాదని, తాను జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కలిసి ఉన్నప్పుడు మాత్రమే వాణీజయరామ్ నవ్వేవారని చెప్పారు. ఏడు స్వరాల పాటను ఆమె మినహా ఎవరు పాడలేరని, వాణీజయరామ్‌ది ప్రత్యేక స్వరం అని పి.సుశీల కొనియాడారు. కాగా వాణీజయరామ్‌ది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ఆమెది సహజ మరణమేనని పోలీసులు ధ్రువీకరించారు. వాణీజయరామ్ తలకు బలమైన గాయం కావడం, ముఖం రక్తసిక్తమై ఉండటం, చేతి రేఖలు వంటి ఆధారాలను తుడిచి వేయడంతో మొదట అనుమానాస్పద మృతిగా భావించారు. వాణీజయరామ్ తన గదిలోని అద్దంతో కూడిన టీపాయ్‌పై పడటంతో తలకు బలమైన దెబ్బ తగలడం వల్ల మృతి చెందినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీసులు తుపాకులతో 30 రౌండ్లు గాలిలో ఫైర్ చేసిన అనంతరం వాణీజయరామ్ భౌతికకాయానికి చెన్నై బీసెంట్ నగర్‌లోని శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

జిల్లా వార్తలు


మహిళ నిర్ణయాధికార శక్తిగా ఎదగాలి



మాట్లాడుతున్న ఓల్గా

ఖమ్మంగాంధీచౌక్: మహిళ తనను తాను గౌరవించుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఓల్గా అన్నారు. ఆదివారం ఖమ్మంలోని యూపీఎస్ కాలనీలో గల టెండర్ రూట్స్ పాఠశాలలో పొరుపల్లి ఝాన్సీరాణి అధ్యక్షతన నిర్వహించిన 'ఓల్గాతో ఓ సాయంకాలం' కార్యక్రమంలో మాట్లాడారు. స్త్రీ తండ్రి, భర్త, కొడుకుపై ఆధారపడకుండా తన జీవితాన్ని తాను తీర్చిదిద్దుకునేలా ఎదగాలన్నారు. స్త్రీలు నిర్ణయాధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వాతంత్య్రం, స్వేచ్ఛతో జీవించాలని, అది వారి బాధ్యత అని అన్నారు. స్త్రీలలో ప్రశ్నించేతత్వం పెరగాలన్నారు. తన రచనా వ్యాసాంమంతా స్త్రీ జాతి బంధనాల నుంచి విముక్తి కావాలనే అంశం చుట్టూనే సాగిందన్నారు. పొరుపల్లి ఝాన్సీ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటంతో మాత్రమే స్త్రీ తనను తాను గెలిపించుకోగలుగుతుందన్నారు. ఇంకా పలు అంశాల్లో స్త్రీ స్వేచ్ఛ సాధించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సుభాషిణి, ఫణి, మాధవి, గాజుల భారతి, సుచరిత, జయశ్రీ, జ్యోతి, జిగీష, ఉష, రాధ, తేజస్వి, నవజీవన ప్రియ, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు, కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ 7వ దశలో నిలిచిన ఉత్పత్తి



పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో ఆదివారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి నిలిచింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడంతో 12వ యూనిట్‌లో 800 మెగావాట్ల ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. కాగా, సీఈ పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. సోమవారం ఉత్పత్తి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సుమారు 80 రోజుల తర్వాత యూనిట్ ట్రిప్ కావడం ఇదే మొదటిసారని చెప్పారు.

'తునికాకు'కు సమాయత్తం

- అభయారణ్యాల్లో సేకరణకు టెండర్ల ఆహ్వానం..
- ఈనెల 14 వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదుకు అవకాశం
- మరో రెండు విడతల్లోనూ స్వీకరణకు చాన్స్
- రాష్ట్రంలో సేకరణ లక్ష్యం 3,23,600 స్టాండర్డ్ బ్యాగులు



కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న కూలీలు (ఫైల్)

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు, కూలీలు వేసవి పంటగా భావించే తునికాకు సేకరణకు అటవీ శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. కూలీలకు నెల రోజుల పాటు ఉపాధి, అటవీ శాఖకు భారీగా ఆదాయం లభించే ఆకు సేకరణకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆన్‌లైన్ టెండర్లకు ముహూర్తం ఖరారు చేసింది. మొదటి విడత టెండర్ల ప్రక్రియ సోమవారం నుంచి 14 వరకు, రెండో విడత 21 నుంచి 28వ తేదీ వరకు, మూడో విడత మార్చి10 నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డీఎం.పృథ్వీరాజ్ వెల్లడించారు. టెండర్ నోటీసును ఈనెల 6 నుంచి డౌన్‌లోడ్ చేసుకుని 10 నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయాల్సి ఉంటుంది. రెండో విడతలో 21వ తేదీన టెండర్ నోటీస్ డౌన్‌లోడ్ చేసుకుని 25 నుంచి 28 వరకు, మూడో విడతలో మార్చి 10న టెండర్ నోటీస్ డౌన్‌లోడ్ చేసుకుని 15, 16 తేదీల్లో దాఖలు చేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

వైల్డ్‌లైఫ్ పరిధిలోనూ సేకరణ

రాష్ట్రంలో మొత్తం 3,23,600 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో అభయారణ్యాల పరిధిలో 1.36 లక్షలు, ఇతర అటవీ ప్రాంతాల్లో 1,87,600 బ్యాగుల ఆకు సేకరించాలని నిర్ణయించారు. అయితే అభయారణ్యాల్లో ఆకు సేకరణను నిషేధించాలని గత నెలలో హైదరాబాద్‌లో సీసీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డీఎఫ్‌ఓలు, ఎఫ్‌డీఓలు కోరారు. తునికాకు సేకరణతో జంతువులకు, అటవీప్రాంతానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైల్డ్‌లైఫ్(అభయారణ్యం) పరిధిలో తునికాకు సేకరణకు టెండర్లు పిలవవద్దని అన్నారు. ఆకు సేకరించే క్రామంలో కాంట్రాక్టర్లు, కూలీలు అడవిలో నిప్పు పెడుతుంటారని, తద్వారా అడవి దగ్ధం కావడంతో పాటు జంతువుల ప్రాణాలకు ప్రమాదకరమని చెప్పారు. అయినా.. అటవీ శాఖ మాత్రం వైల్డ్ లైఫ్, టైగర్ జోన్ల పరిధిలో కూడా తునికాకు సేకరించాలని నిర్ణయించింది.

రాష్ట్రవ్యాప్తంగా అభయారణ్యాల పరిధిలో లక్ష్యం ఇలా..

అభయారణ్యం	యూనిట్లు	స్టాండర్డ్ బ్యాగులు
కిన్నెరసాని	5	3,200
గూడూరు	12	17,100
అమ్రాబాద్ (టైగర్ జోన్)	33	38,800
కవ్వాల్ (టైగర్ జోన్)	46	54,400
ఏటూరునాగారం	3	2,900
జన్నారం	5	5,400
ఉట్నూరు	10	14,200

ఈ అభయారణ్యాల్లో గతేడాది కూడా 1.36 లక్షల స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినా..89,657 స్టాండర్డ్ బ్యాగులు(66 శాతం) మాత్రమే సేకరించగలిగారు.

నిత్య సాధనతో ఉప'యోగ'ం



బహుమతులు అందుకున్న విజేతలతో అతిథులు, యోగా గురువులు

- సింగరేణి జీఎం కట్టా బసవయ్య
- కొత్తగూడెంలో ఉత్తర తెలంగాణ స్థాయి పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): మనం నిత్య జీవితంలో యోగాను ఒక క్రీడగా భావించి రోజూ ప్రాక్టీస్ చేస్తే ఆరోగ్యంగా ఉంటామని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రమైన సింగరేణి ఉన్నత పాఠశాలలో ఆదివారం వివేకనంద స్వామి–పతాంజలి యోగా కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన ఉత్తర తెలంగాణ స్థాయి యోగా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బసవయ్య మాట్లాడుతూ.. ప్రాచీన భారతదేశంలో ప్రారంభమైన యోగా ప్రస్తుతం ప్రపంచ దేశాలకు విస్తరించిందని పేర్కొన్నారు. భారత్‌లో యోగాను జూన్ 21న ఒక ప్రత్యేక దినంగా జరుపుకుంటుండగా ఆదివారం నాడు నిర్వహించిన యోగా పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది యోగా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మికులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఎంతో ఘనంగా నిర్వహించారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా రమణ, శ్రవంతి వ్యవహరించిన ఈ కార్యక్రమంలో యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ, యోగా నేషనల్ రిఫరీ డాక్టర్ ఆర్ రాజలింగు, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, సీనియర్ పీఈటీ గట్టుస్వామి, పీఈటీలు లావణ్య, సుష్మిత, కల్యాణి, సురేష్, మార్తాండేయ, శారద, రమేష్, రాంబాబు, శ్వేత, ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనశీలి విశ్వనాథ్

కళాతపస్విని స్మరించిన కళాకారులు, కళాభిమానులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు, కళాభిమానులు

ఖమ్మంగాంధీచౌక్: సినిమా రంగంలో గొప్ప సృజనశీలి కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ అని పలువురు కళాకారులు కొనియాడారు. ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని ఐఎంఏ హాల్‌లో విశ్వనాథ్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ కళాకారిణి, అడ్వకేట్ వనం కృష్ణవేణి మాట్లాడుతూ.. తెలుగు సినిమా రంగానికి అనేక ఆణిముత్యాల్లాంటి సినిమాలను అందించిన ఘనుడు విశ్వనాథ్ అన్నారు. వెండితెరపై శంకరాభరణం, సాగర సంగమం వంటి ఎన్నో కళాఖండాలను సృజించిన కళాతపస్వి విశ్వనాథ్ దర్శకత్వ ప్రయాణం కూడా అలాగే సాగిందన్నారు. ఆయన పలు సామాజిక అంశాలపై లోతైన అధ్యయనం చేసి సినిమాలను రూపొందించారని అన్నారు. విశ్వనాథ్ క్రమశిక్షణకు మారుపేరని, ఆదర్శవంతుడని తెలిపారు. ఆయనను ఖమ్మానికి మూడుసార్లు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఖమ్మం కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి నాగబత్తిని రవి మాట్లాడుతూ.. సమాజాన్ని మేల్కొలిపే సినిమాలను తీసిన మహానుభావుడు విశ్వనాథ్ అన్నారు. ఆయన భావాలు సమాజాన్ని చైతన్య పరిచాయన్నారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... చిత్ర పరిశ్రమ ఓ మహానుభావున్ని కోల్పోయిందని నివాళులర్పించారు. ప్రతి సినిమాను ఓ యజ్ఞంలా తీసి ప్రజల మనసులను గెలుచుకున్న గొప్ప దర్శకుడని కొనియాడారు. తొలుత విశ్వనాథ్ చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభ ఆరంభంలో దర్శక దిగ్గజానికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్, న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం కోశాధికారి కొత్తమాసు హేమచందర్ రావు, రవీందర్, మాధవరావు, ఎస్వీ రమణ, బీవీ రెడ్డి, వనం తేజస్విని, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, కేవీ కృష్ణారావు, మోదుగు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఏపీకి చెందిన భక్తులు ఆదివారం వెండి కిరీటం బహూకరించారు. కర్నూలుకు చెందిన నాగసాయి భరత్ కుటుంబసభ్యులు కిరీటాన్ని స్వామివారి మూలమూర్తుల పాదాల చెంత ఉంచి పూజలు చేసిన అనంతరం ఆలయ అధికారులకు అందజేశారు. 400 గ్రాముల వెండితో తయారు చేసిన దీని విలువ సుమారు రూ.32 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాస్, రామిరెడ్డి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సందక్పు శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థిని

గ్రామంలో స్వప్నకు ఘన సన్మానం



సన్మానం అనంతరం స్వప్నతో గ్రామస్తులు

దుమ్ముగూడెం: పశ్చిమ బెంగాల్ – నేపాల్ సరిహద్దులోని డార్జిలింగ్ జిల్లాలో గల సందక్పు శిఖరాన్ని మండలంలోని ఆర్లగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని కొర్సా స్వప్న అధిరోహించింది. శిఖరారోహణ అనంతరం ఇటీవలే గ్రామానికి చేరుకు చేరుకున్న స్వప్నను స్థానికులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వప్న ఈ శిఖరాన్ని అధిరోహించడం ఆదివాసి సమాజానికి గర్వకారణమని అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న కాలంలో మరిన్ని అవకాశాలు కల్పించి ఆదివాసీలను ప్రోత్సహించాలని కోరారు. స్వప్నను ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాయం సునీత, స్థానికులు పెనుబల్లి గంగరాజు, శ్రీరాములు, కంగాల భీమయ్య, ఉప సర్పంచ్ కొర్సా నరసింహరావు, ఆదివాసీ సేన మండల కన్వీనర్ కొర్సా నరేష్, స్వప్న తల్లిదండ్రులు గోపాల్, శాంతి తదితరులు పాల్గొన్నారు.